# సుందర నగరంగా కడపను తీర్చిదిద్దుతాం..

- కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

## ఆఫ్ సెంచరీకి చేరువలో టమోటా ధరలు

**మదనపల్లెలో కిలో టమోటా రూ.48**

వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## బొజ్జ. సంజీవరెడ్డిని పరామర్శించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి "మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి" ..



రాయచోటి,ప్రభాతవార్త: సోమవారం నియోజకవర్గంలోని కాటిమాయకుంట పంచాయతీ, బొట్లచెరువు గ్రామానికి చెందిన .హెడ్మాస్టర్ బొజ్జ. సంజీవరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని కడపలో వారి ఇంటి దగ్గరికి వెళ్లి పరామర్శించి, కుటుంబ సభ్యులుకు ధైర్యం చెప్పిన.... లిరాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి "మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి"

## ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు

- ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయవంతం చేయాలి
- మాక్ కౌంటింగ్ శిక్షణా కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ యం.అభిషిక్త్ కిషోర్



రాయచోటి, ప్రభాతవార్త:

కౌంటింగ్ ప్రక్రియలో ఆయా అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలి. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ యం.అభిషిక్త్ కిషోర్ రిటర్నింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్ లోని స్పందన హాలులో ఆర్వోలు, ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్ లకు ఈవీఎం మరియు పోస్టల్ బ్యాలెట్ యొక్క ఎన్నికల ఓట్ల లెక్కింపుపై హాండ్స్ ఆన్ ట్రైనింగ్ (మాక్ కౌంటింగ్ శిక్షణ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ... జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకమైన రీతిలో ప్రశాంతవాతారణంలో నిర్వహించాలన్నారు. రాయచోటి లోని సాయి ఇంజనీరింగ్ కాలేజీలో జూన్, 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు రాజంపేట పార్లమెంట్ మరియు జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో ప్రతి కౌంటింగ్ హాలులో 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారని, ఆయా నియోజకవర్గాలలో పోలైన ఓట్ల సంఖ్యను బట్టి 17 నుండి 21 రౌండ్ల వరకు ఈవీఎం కౌంటింగ్ ఉంటుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం ఆయా నియోజకవర్గ కౌంటింగ్ హాలులో రెండు నుంచి నాలుగు టేబుల్స్ వరకు ఏర్పాటు చేస్తారని చెప్పారు. రాజంపేట పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం విడిగా ఒక కౌంటింగ్ హాలులో 20 టేబుల్స్ ఏర్పాటు చేసి లెక్కించడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కొరకు ప్రతి టేబుల్ కు ఒక ఏఆర్ఓ, ఒక సూపర్వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని పేర్కొన్నారు.ఈవీఎం కౌంటింగ్ నిమిత్తం ప్రతి టేబుల్ కు ముగ్గురు సిబ్బంది ఉంటారని... ఇందులో ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఈ మేరకు ఈవీఎంలలోని ఓట్ల కౌంటింగ్ నిమిత్తం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు 154 మంది సూపర్వైజర్లు, 175 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 138 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తం 467 మంది సిబ్బందిని నియమించడమైనదన్నారు. అలాగే పార్లమెంటుకు సంబంధించి 143 మంది సూపర్వైజర్లు, 168 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 140 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తం 451 మందిని నియమిస్తున్నారని, మొత్తం అసెంబ్లీ మరియు పార్లమెంటుకు సంబంధించి రిజర్వుతో సహా 918 మంది సిబ్బందిని నియమించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# ఉమ్మడి కడప జిల్లాలో తాజా సర్వే

కౌంటింగ్ దగ్గర పడే కొద్దీ పార్టీల సర్వేలు ఊపందుకున్నాయి. ఎవరికి వారు సొంత సర్వే వర్గాలను మోహరించారు. ఫలితాలపై తుది అభిప్రాయానికి వచ్చేందుకు పక్కా సర్వే పేరుతో మరల నివేదికలు సిద్ధమవుతున్నాయి. జనం నాడీ పట్టేందుకు మల్ల గుల్లాలు పడుతున్నారు. ఓట్లకు నోట్లు, సామాజిక సమీకరణలు, అభ్యర్థుల బలాబలాలు, బలహీనతలు, పోల్ మేనేజ్మెంట్, ఎక్కడ బలపడ్డాము, ఎక్కడ చతి కిల పడ్డాము బేరీజు వేసుకుంటూ ఫలితాలను కాచి వడపోస్తున్నారు. తాజాగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ చెందిన నిఘవర్గాలు, సర్వే వర్గాలు నివేదిక అందజేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. పక్కా సీట్లు ఏవి? హోరాహోరీగా జరిగే సీట్లు ఏవి? ఎడ్జ్ ఎవరికి అన్న సమాచారంతో నివేదిక అంద చేసినట్లు సమాచారం.

రాజంపేట అర్బన్,మే 27 ప్రభాతవార్త



- ఉమ్మడి కడప జిల్లాలో తాజా సర్వే వైకాపా-4 తెలుగుదేశం -2
- నాలుగు నియోజకవర్గాల్లో హోరాహోరీ
- చంద్రబాబుకు సర్వే వర్గాల నివేదిక
- షర్మిల ' హస్త ' వాసి 'ఎక్కడ' ముంచుతుందో?
- రాష్ట్రంలో వైసిపికి 75 సీట్ల వద్ద కడపలో ఆగిన బెట్టింగ్..!!

10 సీట్లు ఉన్న ఉమ్మడి కడప జిల్లాలో వైకాపాకు పక్కాగా నాలుగు సీట్లు, తెలుగుదేశం కు రెండు సీట్లు వస్తాయని నివేదికలో పేర్కొన్నారని సమాచారం. పులివెందుల ,రాజంపేట , జమ్మలమడుగు, బద్వేల్ నియోజకవర్గాలలో వైసిపి విజయం ఖాయమని తెలుస్తోంది. ప్రొద్దుటూరు, రాయచోటి నియోజకవర్గాలలో తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆ నివేదికలోని సారాంశం. కడప, కమలాపురం, మైదుకూరు నియోజక వర్గాలలో హోరాహోరీ పోరు జరిగినట్లు సర్వే నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. రైల్వే కోడూరులో జనసేనకు ఎడ్జ్ ఉన్నట్లు సమాచారం. కడప పార్లమెంట్ పరిధిలో హోరాహోరీగా పోరు జరుగుతున్న నియోజకవర్గాలలో ఒక అంచనాకు రాలేకపోవడానికి ప్రధాన కారణం షర్మిల ఎఫెక్ట్. వైసిపి ఎంపీ అభ్యర్థిగా అవినాష్ రెడ్డి విజయంపై ఎలాంటి అనుమానాలు లేకపోయినా కొన్ని నియోజకవర్గాలలో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ప్రధానంగా కడప, కమలాపురం నియోజకవర్గాలలో పోటీ నువ్వా నేనా అన్నట్లు ఉందని సమాచారం. కడప అసెంబ్లీ సెగ్మెంట్లో కాంగ్రెస్ అభ్యర్థికి లభించే ఓట్లు బట్టి వైసిపి తెలుగుదేశం, అభ్యర్థుల విజయ అవకాశాలు ఆధారపడి ఉన్నాయని తెలుస్తోంది. మైదుకూరు నియోజకవర్గంలో సీనియర్ నేత, మాజీ మంత్రి డీల్ రవీంద్రారెడ్డి వర్గం తెలుగుదేశం అభ్యర్థి సుధాకర్ యాదవ్ కు మద్దతు ఇచ్చిన నేపథ్యంలో తెలుగుదేశం కు ఎడ్జ్ ఉండే అవకాశాన్ని సర్వేలో పేర్కొన్నట్లు తెలిసింది. రెడ్డి సామాజిక వర్గం ఓట్లు ఓ మోస్తరుగా చీలినట్లు పేర్కొన్నారని సమాచారం. ఏది ఏమైనా షర్మిల ప్రభావంతో హోరాహోరీ జరుగుతున్న నియోజకవర్గాలలో వైసీపీకి షాక్ తగిలే అవకాశాలు లేకపోలేదని సర్వే నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. జమ్మల మడుగులో పార్టీ సింబల్ ఓటర్లలోకి ఆశించిన స్థాయిలో వెళ్ళలేదని ఇదే అక్కడ బిజెపి అభ్యర్థి ఆదినారాయణ రెడ్డికి ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం చేపడుతుందన్న అంశంపై కడప, పొద్దుటూరు కేంద్రంగా పెద్ద ఎత్తున కోట్లాది రూపాయల బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. పోలింగ్ ముగిసిన తర్వాత వారం రోజుల వరకు కడపలో ఓ కీలక ముఠా వైసీపీకి 75 సీట్ల వరకు బెట్టింగ్ కాసినట్లు తెలిసింది. చేపట్టేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ వరకు కూడా బెట్టింగ్ కొనసాగలేదని సమాచారం.



## సన్న బియ్యం...

# నున్నగా మోసం

- ఆకర్షనీయమైన ప్యాక్‌లతో వినియోగదారులకు వల
- రేషన్ బియ్యాన్ని ఫాలిస్‌చేసి మిక్స్ చేస్తున్న వైనం
- కల్తీ చేసిన బియ్యం అధిక ధరలకు అమ్మకాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- దాడులు చేస్తారు..మామూళ్లు ఇస్తే వదిలేస్తారు కేసులెక్కడ..?

పీలేరు, మే 27 ప్రభాతవార్త

మెరిసేవన్నీ బంగారం కావు...అలాగే రంగుల ఆకర్షనీయమైన సంచుల్లో ఉన్న బియ్యం నాణ్యమైనవి కాదు. వినియోగదారుల ఆసరాను, అమాయకత్వాన్ని పసిగట్టి కొందరు బియ్యం మండీల వ్యాపారస్తుల సన్నబియ్యం అంటూ నున్నగా చేస్తున్నారు. రంగు రంగులగా ఆకట్టుకునే బ్యాగుల్లో నాసిరకం బియ్యాన్ని నింపి విక్రయిస్తున్నారు. పీలేరు పట్టణంలో కొందరు బియ్యం వ్యాపారుల మాయాజాలానికి ఇదో నిదర్శనం. దూర ప్రాంతాల నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలంఒటే ఒక వైపు అధిక ధర, మరోవైపు రవాణా చార్జీలు ఎక్కువుతోందని భావించిన అక్రమార్కులు, రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని పాలీష్ చేసి శివారు ప్రాంతాల్లో, ఏదైనా బిల్డింగ్‌లో రూములను అద్దెకు తీసుకొని సంచుల్లో మిక్సింగ్ చేస్తూ కుట్టివేస్తున్నారు. వివిధ కంపెనీల పేరిట ముద్రతో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. అవి కూడా తూకాలు 25కేజీల ప్యాకట్ ధర తీసుకొంటూ అందులో 24కేజీల బియ్యం విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికారులు, డిటిలు, ఇందుకు సంబంధించిన ట్యాక్స్ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు జోరందుకొన్నాయి. బియ్యం దుకాణాల్లో ఎప్పుడైనా అధికారులు దాడులు చేస్తే మామూళ్లు ఇస్తూ వారి నోరు మూయిస్తున్నట్లు సమాచారం. పట్టణానికి చెందిన ఓ ఉద్యోగి రూ.1350 పెట్టి ఇటీవల బియ్యపు మూటను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్ళి వండితే మెతుకులన్నీ బొద్దుగా కనిపించడం, నోటికి రుచి అందకపోవడంతో నాసిరకం బియ్యాన్ని తనకు అంటగట్టాడని గ్రహించాడు. మరుసటి రోజు ఉదయం వ్యాపారి దగ్గరికి బియ్యాన్ని తీసుకెళ్ళి వాపస్ తీసుకోమని వ్యాపారి తెలిపాడు. చేసేదిలేక వచ్చినదారినే వెనుదిరిగాడు. ఆ ఉద్యోగి రెండు విధాలుగా నష్టపోయారు. రేటు విషయం ఒకటైతే..నకిలీ విషయంలో మరో విధంగా నష్టపోయాడు. ఇది ఈ ఒక్క ఉద్యోగి విషయంలోనే కాకుండా నిత్యం పట్టణ వ్యాప్తంగా వ్యాపారులు చేతుల్లో నష్టపోతున్నా వేలాది మంది ప్రజలు విషయం. నెంబర్ వన్ క్వాలిటీ బియ్యం పేరుతో వ్యాపారులు ప్రజలను మోసపుచ్చుతున్నారు. వేలాది రుపాయలు వెచ్చించి కొన్న ఫలితం లేకుండా పోతుండడంతో విక్రయదారులు నష్టపోతున్నారు. నంబవర్‌వన్ క్వాలిటీ పేరుతో నకిలీ బియ్యాన్ని ప్రజలకు అంటగడుతూ వ్యాపారులూ, డీలర్లు ఏజెంట్లు లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణంలో అధిక బ్రాండ్లు బులె ్లట్ కంపెనీ, తాజ్‌మహాల్, బెల్‌గుర్తు, హెచ్ఎంటిలు, గోపాల్, గోపిక, నంద్యాల బియ్యం, ఆఫిల్, గోవర్ధన్, హంస వీటిల్లో జిలకర మసూర వంటి రకాలు అధికంగా విక్రయిస్తుంటారు. అయితే కంపెన్లీ బ్రాండ్‌ను కొందరు వ్యాపారులు వాడుకొని అదే పోలికతో కూడిన బస్తాలను తయారు చేయించి అందులో నాసిరకం బియ్యం నింపి ప్రనజలను మోసపుచ్చుతున్నారు.

**బ్రాండెడ్ బస్తాల్లో నాసిరకం మిక్సింగ్ :**

పట్టణంలో నాణ్యమైన ఖాళీ బస్తాలను ఒకొక్కటి రూ.15నుంచా 20లుచొప్పున కొనుగోలు చేసి వాటిపై బ్రాండెడ్ కంపెనీల పేర్లు ముద్రిస్తున్నారు. ఇలాంటి బస్తాల్లో నాసిరకం బియ్యం నింపి 26కేజీల బస్తా రూ.1500 నుంచి 1700ల వరకు అమ్మకాలు జరుపుతున్నారు. కంపెనీ పేర్లు ముద్రించి ఉండడం చేత బియ్యాన్ని పరిశీలించకుండానే వినియోగదారులు కొనుగోలు చేసి దారుణంగా మోసపోతున్నారు. కొన్ని చోట్ల ఏకంగా రైస్‌మిల్లుల నుంచి ఈ తరహా మోసం జరుగుతోందన్న సమాచారం. రేషన్ బియ్యాన్ని చౌకదుకాణడీలర్ల వద్ద తక్కువుగా కొనుగోలు చేసుకొని రీసైక్లింగ్ చేస్తున్నారు. ఇలా సన్నగైన బియ్యాన్ని బ్రాండెడ్ బస్తాల్లో కలిసి విక్రయిస్తున్నారు. ఇలాంటి సన్నబియ్యాన్ని మిక్సింగ్ చేస్తూ పట్టణంలో అధికంగా అమ్ముతున్న బియ్యం వ్యాపారులపై దాడులు నిర్వహిస్తే వారిని కూర్చోపెట్టి మామూళ్ళు ఇచ్చి అధికారులకు నాలుగు మాయమాటలు చెప్పి పంపిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎందుకంటే పలు బియ్యంవ్యాపారులపై రెవెన్యూ అధికారులు పలుసార్లు దాడులు నిర్వహించారు. అయితే ఒకరిపై కూడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదంటే మామూళ్ళుతో సరిపెట్టుకొంటున్నారు అనే మాటలో సందేహం లేదని చెప్పవచ్చు. ఏది ఏమైనా ఇలాంటి మోసగాళ్ళపై సంబంధిత అధికారులు తలొగ్గకుండా నిక్కచ్చిగా వారి పనులు వారుచేసి

## ఎన్నికల గెలుపు ఓటములపై

# పందాలు జోరు

**చేతులు మారుతున్న లక్షలాది రుపాయలుక్ష్మకాయ్..రాజా...కాయ్ అంటూ...**

మదనపల్లె, మే 27 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు ఓటములపై పందాలు జోరుగా కాస్తున్నారు. లక్షలాది రుపాయలు బెట్టింగ్‌లు వేసుకోవడం జరుగుతోంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు కౌంటింగ్ జరగనున్నది. నియోజకవర్గంలో తమ అభ్యర్థే గెలుపొందుతాడని, రాష్ట్రంలో తమ పార్టీనే అధికారంలోకి వస్తుందని జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ప్రధానంతా వైకాపా, తెలుగుదేశం పార్టీలకు చెందిన నాయకులు బెట్టింగ్‌లు కాస్తున్నారు. నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు ఓటములకు సంబంధించే కాకుండా ఎమ్మెల్యే అభ్యర్థుల మోజార్టీల పైన బెట్టింగులు వేసుకోవడం జరుగుతోంది. ఇక రాయలసీమ జిల్లాలకు సంబంధించి, కోస్తా, ఆంధ్రా జిల్లాలకు సంబంధించి కూడా బెట్టింగులు కాస్తున్నారు. ఇన్నాళ్ళు ఐపిఎల్ క్రికెట్ బెట్టింగులు జోరుగా జరిగేవి. ఆదివారంతో క్రికెట్ ఐపిఎల్ మ్యాచ్‌లు ముగియడంతో ఎన్నికల ఫలితాలకు సంబంధించి బెట్టింగ్‌లు కాస్తున్నారు. ముఖ్యమంత్రిగా తమ పార్టీకి చెందిన వారే ప్రమాణ స్వీకారం చేస్తారని కూడా బెట్టింగ్‌లు వేసుకొంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఆఫర్ రేట్లతో కూడా బెట్టింగులు కాస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు ప్రాధాన రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికలు కీలకం కావడం జరిగింది. ఎన్నికల ప్రచారంలో కూడా జోరుగూ నిధులు ఖర్చుచేయడం జరిగింది. ఇక బెట్టింగులకు సంబంధించి అభ్యర్థుల అనుచరవర్గం జోరుగా



కాసుకొంటున్నారు. ఎన్నికల ఫలితాల తేది సమీపిస్తుండడంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొనగా, బెట్టింగులు కాసిన వారిలో కూడా టెన్షన్ నెలకొంది. ముఖ్యంగా మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు ఓటములపై బెట్టింగులు వేసుకొంటున్నారు. ఎంపి అభ్యర్థుల గెలుపుకు సంబంధించి కూడా బెట్టింగులు కాస్తున్నారు. బెట్టింగులకు పోలీసులు నిఘా ఉంచినా ప్రయోజనం లేకుండా పోతోంది.

## అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు

**స్పందించని అధికారులు**



ఖాజీపేట, మే 27, ప్రభాతవార్త:

ఖాజీపేట మండలంలోని పలు ప్రాంతాలలో మైనింగ్ చేసేందుకు అనుమతి లేకపోయిన కొంతమంది పెద్దలు అక్రమంగా చెరువుల నుంచిమట్టిని నాగసానిపల్లె కొండ ప్రాంతం నుంచి గ్రావెల్ తవ్వకాలు జరుపుతూ యదేచ్ఛగా తరలిస్తున్నారు. రోజుల తరబడి గ్రావెల్, మట్టిని అక్రమంగా తవ్వి తరలించేందుకుకొంతమంది అధికారులు యదేచ్ఛగా సహకారం అందించడంతో పాటు అధికార పార్టీ నాయకుల అండదండలతో కొండలను, చెరువులను గుల్ల చేస్తున్నారు. ప్రస్తుతంఅధికారులు ఎన్నికల కార్యక్రమాలతో బిజీగా ఉండటంతో ఎన్నికల ఫలితాల లోపల తమ కార్యకలాపాలను ముగించుకునే విధంగా తవ్వకాలను ముమ్మరం చేసి పగలు,రాత్రి తేడా లేకుండా తరలించారు. అక్రమ లేఔట్లకు కొండ ప్రాతం నుంచి మట్టిని ప్రొక్లెయిన్లతో తవ్వకాలకు పాల్పడి పదుల సంఖ్యలో ట్రాకర్లు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు.ఈ తవ్వకాలకు రెవెన్యూ, గనులశాఖతో పాటు ఇరిగేషన్ అధికారులు కూడ సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల అండతోనే మైనింగ్ మాఫియాకుతెరలేపారని మండిపడుతున్నారు. ఆంజనేయ కొట్టాల చెరువులో గుంతలు ఎక్కువ లోతు తీసి మట్టిని తరలిస్తున్నారని చెరువు అంతా గుంతలమయం అయిందని కేసీకెనాల్ నుంచి వచ్చే నీరును ఆయకట్టుకు అందించేందుకు ఆంజనేయ కొట్టాల చెరువులో స్టోరేజ్ చేస్తారని అయితే ఈ మట్టి తరలింపు వల్ల నీరు లీకేజి కావడంతో పాటు గుంతలలో నీరు ఉండిపోయి ఆయకట్టుకు ఉపయోగం లేకుండా పోతుందని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శుక్రవారం రాత్రి చెరువు వద్ద కొంతమంది ఇరిగేషన్ అధికారులు మట్టి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని వదిలేసినట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. మట్టి, గ్రావెల్ అక్రమరవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అందుకు సహకరిస్తున్న అధికారులపై విచారణ నిర్వహించి తవ్వకాలకు పాల్పడిన వారిపై, తెరవెనుకఉండి అక్రమ రవాణాకు సహకరిస్తున్నా వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం... ఎన్డీయే కూటమి పథనం ఖాయం
## రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా చింతల హ్యాట్రిక్ పక్కా

పీలేరు, మే 27 ప్రభాతవార్తః

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గంతో పాటు రాజంపేట ఎంపీ సెగ్మెంట్‌లో గల ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో వైఎస్సార్‌సీపీదే ఘన విజయం. 2014, 2019 ఎన్నికల్లో రాజంపేట ఎంపీగా విజయదుందుబి మోగించిన పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ప్రస్తుతం 2024 ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా అదేవిధంగా 2014, 2019 ఎన్నికల్లో పీలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన చింతల రామచంద్రారెడ్డి 2024లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా హ్యాట్రిక్ పక్కా, పీలేరు అసెంబ్లీ రాజంపేట పార్లమెంటు గడ్డలపై ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే, రాష్ట్రంలో జగన్ రెండవసారి సీఎం కావడం ఖాయం, రాజంపేట, పార్లమెంటు, పీలేరు అసెంబ్లీలు వైఎస్సార్‌సీపీదే మూడవసారి గెలుపు తథ్యం, ఈగెలుపుతో నియోజకవర్గంలో మరోసారి అభివద్ధి జెట్ స్పీడుతో పరుగులు పెడుతుంది. నియోజకవర్గ ప్రగతి పథంలో పయనిస్తుంది. చరిత్ర సష్టించబోతున్నాము. క్షేత్రస్థాయిలో పోలింగ్‌ను పరిశీలిస్తే కూటమి గెలిచే పరిస్థితి లేదు. ప్రజలు సంక్షేమ పాలననే కోరుకుంటున్నారు. అన్ని వర్గాలకు పథకాలు గ్రామాల్లోనే పౌర సేవలు, వలంటీరు సచివాలయ వ్యవస్థలు వంటి అంశాలు కూటమిని దెబ్బతీశాయి. ల్యాండ్ టైటలింగ్ యాక్టు ప్రజల్లో ఏమాత్రం ప్రభావం చూపలేదు, మీఅందరి మంచి కోసం 58 నెలల్లో 124 సార్లు బటన్ నొక్కాను, ఈమంచి ఇలాగే కొనసాగాలంటే మీరు రెండు సార్లు బటన్‌లు నొక్కండి ఒక్కటి ఎమ్మెల్యే కోసం రెండవది ఎంపీ కోసం అని జగన్ అభ్యర్థన మేరకు మాకు, మా పిల్లలకు మంచి చేసిన నాయకుడు జగన్ అని నమ్మి వెంట నడిచి ఓట్లు వేశారు. మా నమ్మకం నువ్వే జగన్,,, జగనన్నే మా భవిష్యత్తు అనే ప్రజలు చాలా బలంగా చెబుతున్నారు. మీ అందరి ఆశీస్సులతో జగన్ మళ్లీ వస్తున్నాడు, ఏపీలో ఎక్కడ చూసిన జగనే, చేయలేనిది చెప్పకూడదు.. మాట ఇస్తే తప్ప కూడదు అనే సిద్దాంతంను నమ్మిన జగన్ చేసేదే చెప్పాడు.. చెప్పిందే చేస్తాడు. మళ్లీ జగన్ వస్తే భవిష్యత్తు మరింత గొప్పగా మారుతుందని బలంగా నమ్ముతున్న ప్రజలు సమగ్రాభివద్ది దిశగా ఏపీ దూసుకెళ్తుంటే మళ్లీ జగన్ రావాల్సిందేనని అన్ని చోట్లా బలమైన ఆకాంక్ష. జగన్ 40 ఇయర్సు ఇండస్ట్రీని 40 ఏళ్ల కుర్రాడు పరుగెత్తించాడు. ఆ పరుగును ఇంకా 30 ఏళ్లు ఎవరు ఆపలేరు, చంద్రబాబునాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పంలో కూడా 2019 ఎన్నికల్లో 85.08 శాతం నమోదు కాగా 2024లో 89.88 శాతం పోలింగ్ నమోదైంది. కుప్పంలో చంద్రబాబుకు ఓటమి తప్పదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలలో ఇద్దరు మాజీ సీఎంలు ఓటమి తథ్యం. 2024 జూన్ తరువాత తెదేపా పూర్తిగా గల్లంతు ఖాయం అని వైఎస్సార్‌సీపీ సీనియర్‌నాయకులుమద్దిరాళ్ల మల్లికార్జున అన్నారు. ఈకార్యక్రమంలో షేక్ మహమ్మద్‌రఫీ, షేక్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



# కోర్టులో గంగమ్మ జాతరకు ఘనంగా ఏర్పాట్లు
## నేటినుంచి వైభవంగా జరగనున్న జాతర

మదనపల్లె, మే 27 ప్రభాతవార్త:



కోరిన భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ఉంటున్న కోర్టులో గంగమ్మ జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయకమటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు వైభవంగా జాతర జరగనున్నది. మంగళవారం సాయంత్రం, బుధవారం పగలు తిరుణాలతో జాతర ఘనంగా జరుగుతుంది. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన కోర్టులో గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మదనపల్లె పట్టణ ప్రజలతో పాటు పలు ప్రాంతాల నుంచి గంగమ్మ జాతరకు విచ్చేసి భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించనున్నారు. మహిళలు దీలు బాణాలు పట్టి మొక్కులు తీర్చుకొంటారు. జాతర రోజేకాకుండా ప్రతి మంగళ, శుక్రవారాల్లో కోర్టులో గంగమ్మకు పూజలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు.

# మట్టిమాఫియాపై బహిరంగ విచారణకు సిద్ధమా?

వేంపల్లె, మే 27, ప్రభాతవార్త ః



ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం వేంపల్లె పట్టణంలో అక్రమంగా మట్టి తోలుతున్న వైఎస్ఆర్‌సీపీ ఎంపీటీసీ భారతి బహిరంగ విచారణకు సిద్ధమా అని భాజపా నాయకుడు గాలి హరిప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ పేరు చెప్పుకుని అక్రమంగా మట్టి తోలింది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ అధికారులు ఒక హెక్టారుకు అనుమతిస్తే వందల ఎకరాలు తోలింది వాస్తవం కాదా అన్నారు. భాజపా ఫిర్యాదు చేసినప్పుడే కదా మీకు రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించింది, అంతవరకు మీరు మీకున్న లీజు అనుమతి ఎక్కడ ఉందో తెలియకుండానే అధికారాన్ని అడ్డుపెట్టుకుని నీ ఇష్టం వచ్చినట్లు మట్టి తోలి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టింది వాస్తవం కాదా అని అన్నారు. వేంపల్లె పట్టణంలో ఏ ఒక్కరిని అడిగినా ఎవరు అక్రమంగా మట్టి తోలుతున్నారనే విషయాన్ని చెబుతారన్నారు. గతంలో ఉన్న తహసీల్దారును బెదిరించిన సంగతి వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. లీజు ముగిసి అరు నెలలు గడుస్తున్నా ఎన్ని క్యూబిక్‌మీటర్ల మేర మీరు అక్రమంగా మట్టి తోలారో నిరూపించడానికి భాజపా సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కె.రామచంద్రారెడ్డి, విజయలక్ష్మి, సుష్మా, మునగల ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఖరీఫ్ లో ప్రతి రైతుకు విత్తన కాయలు కచ్చితంగా అందజేయాలి జెడి చంద్రనాయక్

లక్కిరెడ్డిపల్లె,మే 27,ప్రభాతవార్త:



ఈ ఖరీఫ్ లో పంట సాగు చేసేకునే ప్రతి రైతుకు విత్తన కాయలు కచ్చితంగా పంపిణీ చేయాలని అగ్రికల్చర్ జెడి చంద్రనాయక్ పేర్కొన్నారు.సోమవారం లక్కిరెడ్డిపల్లె లోని ఆర్ బి కే 1 లో వేరుశనగ విత్తన కాయలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మండలానికి 21 90 క్వింటాళ్లు వేరుశనగ విత్తన కాయలు అందుబాటులో ఉన్నాయని పంట సాగు చేసుకునే పాసుబుక్కు ఉన్న ప్రతి రైతుకు విత్తన కాయలు సక్రమంగా అందజేయాలని రైతు భరోసా కేంద్రం సిబ్బందికి తెలియజేశారు.మండలానికి వచ్చిన వేరేశనగ విత్తన కాయలను ఔటన్ 74% కన్నా తక్కువ నాణ్యత ఉంటే తిరిగి వెనక్కి పంపిస్తామని అయితే ప్రస్తుత వచ్చిన విత్తన కాయలు 80 పైన నాణ్యత ఉందని రైతులు ఈ వేరుశనగ వాత్తన కాయలను సద్వినియోగం చేసుకోవలన్నారు.ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఈ ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన విత్తన కాయలు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ప్రతి రైతుకు అందజేయాలన్నారు.విత్తన కాయలు ఎరువులు పంపిణీలో ఎవైనా అవక తౌకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని ఆయన ఆర్బీకే సిబ్బందికి వ్యవసాయ సిబ్బందికి హెచ్చరించారు.ప్రతి ఆర్ బి కే లో ఈ ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన విత్తనాలను అన్ని సక్రమంగా అందిస్తామని వీటిని రైతులకు సక్రమంగా అందజేయాలన్నారు ప్రస్తుతం నారాయణి రకం అందుబాటులో ఉన్నాయని త్వరలో కే 6 వస్తాయన్నారు నేటి నుంచి విత్తన కాయలను సాగు చేసుకోవాలన్నారు.ఇప్పటికే పులకరి చినుకులకు లోతుక్కులు చేసుకున్నారని రైతుల విత్తన కాయలను తయారు చేసుకుని వర్షం పడిన వెంటనే ఎత్తుకోవాలని ఆయన రైతులకు తెలియజేశారు.సీజన్లో పంట సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడి జయరాని టెక్నికల్ ఏవో రమేష్ రాజు ఏఈఓ కేరోలిన్ ఆర్ బి కే పవన్ రైతులు పాల్గొన్నారు.

# ఆఫ్ సెంచురీకి చేరువలో టమెటా ధరలు
## మదనపల్లెలో కిలో టమోటా రూ.48



మదనపల్లె, మే 27 ప్రభాతవార్త:

టమోటా ధరలు గత వారం రోజులుగా గణనీయంగా పెరుగుతున్నాయి. సోమవారం మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్‌యార్డులో మొదటి రకం కిలో టమోటా రూ.48లు ధర పలికింది. ఆఫ్‌సెంచరీకి చేరువలో ధరలు ఉన్నాయి. మార్కెట్‌యార్డుకు 560మెట్రిక్ టన్నులు టమోటాలు వచ్చాయి. మొదటిరకం పదికేజీల టమోటాబాక్స్ రూ.440నుంచి 480ల వరకు ధరలు పలికాయి. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ ఉండడం వల్లే ధరలు పెరిగాయలని వ్యాపారస్తులు చెబుతున్నారు. టమోటా ఉత్పత్తి కూడా తక్కువుగా ఉండడం వల్లే ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. ఇన్నాళ్ళు ధరలు లేక నష్టాలు చవిచూసిన రైతాంగానికి ధరలు పెరగడంతో రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. ఇవే ధరలు నెల రోజులు పాటు ఉంటే రైతులు అప్పుల బాద నుంచి గట్టు ఎక్కగలరని చెబుతున్నారు. రాష్ట్రంలోనే మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డు వ్యాపార లావాదేవీలకు పేరు పొందింది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిస్సా, కర్నాటక, తెలంగాణ, మద్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తారు. టమోటా వ్యాపార లావాదేవీలతో మార్కెట్‌లో వేలాదిమంది కూలీలు జీవనం పొందుతున్నారు.

# పులివెందులలో వన్‌వే అమలు

పులివెందుల రూరల్, మే 27, ప్రభాతవార్త ః

పులివెందులలో సోమవారం నుండి వన్‌వే అమలు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా కడప, కదిరి, ముదిగుబ్బ, తిరుపతి, బెంగుళూరు మార్గాలకు వెళ్లే సర్వీసులు ఆర్టీసీ బస్టాండు నుండి పూలంగళ్లు, వెంకటేశ్వరస్వామి దేవాలయం మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు. ఈ మార్గాలలో ప్రయాణించాలనుకునే వారు అమ్మవారిశాల వీధి ప్రారంభంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద ఉన్న బస్సు స్టాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఇక్కడ బస్సులు ఆపుతారని తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని వారు కోరారు.

# ఎస్ఆర్ఐటీలో ఉద్యోగ సాధకుల దినోత్సవం

ప్రొద్దుటూరు క్రైం, మే 27, ప్రభాతవార్త:




సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు 2023-24 విద్యా సంవత్సరంలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గౌరవించడం మరియు గుర్తించడం కోసం సోమవారం ఉద్యోగ సాధకుల దినోత్సవం జరుపుకోవడం జరిగిందని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలియజేస్తూ డీటీఈ కార్యాలయం మరియు ఎస్‌బీటీఈటీ పాలిటెక్నిక్ విద్యార్థులందరికీ అనేక ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించాయని అందుకే మా కళాశాలలో 144 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ నరేష్ (కన్సల్టెన్సీ ఒరాకిల్), శ్రీమతి డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు శిరీష (ప్రొద్దుటూరు)లు మాట్లాడుతూ డిప్లొమో హోల్డర్స్‌కు ఉద్యోగ అవకాశాల గురించి సవివరంగా తెలియజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్రేక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కేఎల్ఎంఎల్, ఐరా తదితర కంపెనీల ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు. ఎంపికైన విద్యార్థులందరినీ సెక్రటరీ బసిరెడ్డి వీర కల్యాణ్‌రెడ్డి అభినందిస్తూ ఎస్ఆర్ఐటీ విద్యార్థుల అభివృద్ధికి కార్యకలాపాలు మరియు ప్లేస్‌మెంట్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బసిరెడ్డి, రాజేశ్వరరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు అధ్యాపకులు, ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను అభినందించారు.

## చాందినీ బండ్ల మెరవనితో ముగిసిన శ్రీయల్లమ్మ తిరుణాల

కేవి.పల్లె, మే 27 ప్రభాతవార్తః



మండలంలోని గర్నిమిట్ట లో వెలసిన గ్రామదేవత గర్నిమిట్ట శ్రీయల్లమ్మ దేవి తిరుణాల సోమవారం చాందినీ బండ్లు మెరవనితో ముగిసింది. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈతిరుణాలకుఅన్నమయ్య జిల్లా వాసులే కాకుండా చుట్టుపక్కల ఉన్న జిల్లాకు చెందిన ప్రజలు కర్నాటక , తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ప్రజలు కూడా విచ్చేసి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. మొక్కుబడి చేసుకున్న భక్తులు వివిధ రకాలుగా మొక్కులు చెల్లించుకున్నారు. ఈతిరుణాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేవి.పల్లె పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

# లింగ నిర్ధరణ చేయడం చట్టరీత్యా నేరం

పులివెందుల, మే 27, ప్రభాతవార్త ః



గర్భంలోని శిశువు లింగ నిర్ధరణ చేయడం చట్టరీత్యా నేరమని పులివెందుల ఆర్డీవో వెంకటేశులు అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబరు అప్రోప్రియేట్ అథారిటీ అడ్వైజర్ కమిటి ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో భ్రూణహత్యల నివారణ కొరకు స్కానింగ్ కేంద్రాలపై పూర్తిస్థాయి నిఘా ఉంచాలన్నారు. అలాగే కళాజాత బృందాల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గర్భస్రావం కొరకు వాడే మాత్రలను డాక్టర్ సిఫార్సు లేకుండా మందులు ఇవ్వకూడదని, అలా ఇచ్చే మందుల దుకాణాలు, ఏజన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి ఖాజామొయిద్దిన్, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత, డాక్టర్ వైఎస్ఆర్ సర్వజన ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ అనన్య, రేడియాలజిస్టు డాక్టర్ షాలిని, నగరిగుట్ట, బాకరాపురం పట్టణ ప్రాథమిక వైద్యశాలల వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మానవసేవే - మాధవసేవ...
## వీఎస్ఎన్ అధినేత్రి వడ్లమూడి మాధవి



పీలేరు, మే 27 ప్రభాతవార్తః మానవసేవే...

మాధవసేవ అని వీఎస్ఎన్ సిద్దార్థ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి అన్నారు. తన భర్త వీఎస్ఎన్ సిద్దార్థ విద్యాసంస్థల వ్యవస్థాపకులు వడ్లమూడి శ్రీనివాసులునాయుడు 13వ వర్ధంతి సందర్భంగా వడ్లమూడి మాధవి సోమవారం కలికిరి సమీపంలోని సర్వోదయ వద్దాశ్రమంలో ఉన్న వారికి దుస్తులు పంపిణీ చేశారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి అన్నదానం చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి ఆమె కూడా వద్దాశ్రమం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈసందర్భంగా మాధవిగారు మీడియాతో మాట్లాడుతూ భగవంతుడు మనకు ఇచ్చిన దాంట్లో కొంత ఇతరులకు దానం చేయడం వల్ల వారికి సంతోషంగా జీవించడానికి మనం ఉపయోగపడిన వారవుతామన్నారు. ఇతరుల సంతోషాన్ని మనం ఎప్పుడు కోరుకుంటామో అప్పుడు మనం మరింత ఆనందంగా ఆరోగ్యంగా జీవించే అవకాశాన్ని భగవంతుడు కల్పిస్తారని తెలిపారు. వడ్లమూడి శ్రీనివాసులునాయుడు ఉన్నన్ని రోజులు విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే విధంగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దారని వారి ఆశయాలను నెరవేర్చడానికి తాము నిరంతరం కషిచేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో వీఎస్ఎన్ సిద్దార్థ విద్యాసంస్థల అధ్యాపక బందం పాల్గొన్నారు.

# వైఎస్ భాస్కర్‌రెడ్డిని కలిసిన సింహాద్రిపురం నాయకులు



పులివెందుల రూరల్, మే 27, ప్రభాతవార్త ః

సింహాద్రిపురం మండల వైఎస్ఆర్‌సీపీ నాయకులు సోమవారం హైదరాబాదులో ఉన్న నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డిని, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి శంకర్‌రెడ్డిలను కలిశారు. సింహాద్రిపురం మండల ఎన్నికల పరిశీలకులు గండ్లూరు వీరశివారెడ్డితో కలిసి సింహాద్రిపురం మార్కెట్ కమిటి ఛైర్మన్ వెన్నపూస రామ్మోహన్‌రెడ్డి, మైనార్టి నాయకులు ఎం.ఎ. బషీర్‌ముల్లా, మహమ్మద్, కృష్ణారెడ్డి, అన్నం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# భారత మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ
## - అన్నమయ్య డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్

రాయచోటి గ్రామీణ, మే 27, ప్రభాతవార్త:



భారతదేశానికి మదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి నెహ్రూ ఎంతో కృషి చేశారని అన్నమయ్య డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్ అన్నారు. 60వ వర్ధంతి సందర్భంగా సోమవారం డీసీసీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ నేషనల్ కాంగ్రెసలోని ముఖ్యమైన నాయకులలో జవహర్ లాల్ నెహ్రూ ఒకరని, భారతదేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రధాన నాయకులలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఒకరని ఆయన అన్నారు. నెహ్రూ భారతదేశంలో మొదటి సార్వత్రిక ఎన్నికలలో పోరాడి విజయం సాధించారు. ఆ తరువాత 2, మూడో సారి ప్రధానిగా గెలిచారు. 27 మే 1964న ఆయన మరణించే వరకు కార్యాలయంలో పని చేశారని చెప్పారు.

# స్త్రీ పురుష నిష్పత్తిని సమానంగా చూసే బాధ్యత అందరి మీద ఉంది
## : డెమో అధికారిణి శిరోమణి

వీరబల్లి, మే27,ప్రభాతవార్త :



ప్రస్తుత సమూజంలో స్త్రీ పురుష నిష్పత్తి ని సమానంగా చేసే బాధ్యత మన అందరిమీద ఉందని జిల్లా వైద్య కార్యాలయ డెమో అధికారిణి శిరోమణి తెలిపారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్బంగా అక్కడి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధరణ వ్యతిరేక చట్టం గురించి వివరించారు. ముఖ్యంగా గర్బంతో ఉన్న స్త్రీలు లింగ నిర్ధరణ పరీక్షలు చేయించుకోరాదని అట్లు చేయించుకుంటే చట్ట పరిధిలలో నేరమని తెలిపారు. అలాగే సాధారణ ప్రసవాలు గురించి తెలియజేశారు. స్త్రీ పురుష నిష్పత్తి సమానంగా లేకుంటే జరిగే అనార్ధాల గురించి ఆడపిల్ల యెక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆడపిల్లల్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిమీద ఉందన్నారు. మరియు అనవసంగా సిజేరియన్ ఆపరేషన్ చేయించుకోవడం గురించి దాని ద్వారా తల్లులకు, వారి కుటుంబాలకు దాని వలన వచ్చే ఇబ్బందుల గురించి అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రసవాల వలన తల్లి బిడ్డల ఆరోగ్య పరిస్థితి బాగుంటుందని తెలలిపారు. సిజేరియన్ ఆపరేషన్ చేయించుకునే తల్లులకు దీర్ఘ కాలిక జబ్బుల బారిన పడే అవకాశం ఉందన్నారు. అలాగే డబ్బులు కూడా వృదా అని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప సహజంగా సిజేరియన్ ఆపరేషన్ చేయుంచుకోరాదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్కువగా సాదారణ కాన్పులు జరుగుతాయని కావున ప్రభుత్వ ఆసుపత్రులలోనే సాధారణ కాన్పులు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమమంలో డాక్టర్ తేజేశ్వని, సిహెచ్ఓ సుధాకర్, హెచ్ఈ ఉషారాణి, పిహెచ్‌యన్ గంగులమ్మ, సూపర్‌వైజర్లు సరోజ, శివయ్య, ఏయన్‌యంలు, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులచే చాచా నెహ్రూ 60వ వర్ధంతి



కడప వైద్యవిభాగం, మే 27, ప్రభాతవార్త:

భారతదేశానికి తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని ఇన్సాఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌస్‌బాషా అన్నారు. సోమవారం వారి కార్యాలయంలో రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో చాచా నెహ్రూ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మే 27వ తేదీ 1964లో ఆయన మరణించారని ఆ సందర్భంగా నజుమున్ పాఠశాల చిన్నారులతో నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి అలంకరించారు. ఆయన మాట్లాడుతూ చాచా నెహ్రూకు చిన్నారులంటే ఎంతో అభిమానమని అందుకు ఆయన నవంబరు 14న నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధినేత అబ్దుల్ రాయల్ కరీముల్లా, పాఠశాల చిన్నారులు రసూల్, జమీల్ మహ్మద్, అల్లా బకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పగిడాలపల్లె గంగమ్మ జాతర

పెండ్లిమర్రి, మే 27, ప్రభాతవార్త:

మండలంలోని పగడాలపల్లె గ్రామంలో వెలసిన శ్రీ గంగమ్మ ఆలయంలో మంగళవారం, బుధవారం తిరునాళ్ల జరుగుతున్నట్లు తిరునాళ్ల ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకోవాలన్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని వారు తెలిపారు.

# పండిట్ నెహ్రూ గొప్ప దార్శనికుడు



వేంపల్లె, మే 27, ప్రభాతవార్త ః

భారతరత్న, భారత తొలి ప్రధాని స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గొప్ప దార్శనికుడని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. సోమవారం వేంపల్లెలో నెహ్రూ 60వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ నెహ్రూ ఆగర్భ శ్రీమంతుడిగా పుట్టినప్పటికీ దేశానికి స్వాతంత్ర్యం కోసం పలు జైళ్లల్లో దుర్భర జైలు జీవితాన్ని గడిపిన స్వాతంత్ర్య సమరయోధుడు అన్నారు. దేశ తొలి ప్రధానిగా 17ఏళ్లపాటు దేశాన్ని పాలించిన పరిపాలనాదక్షుడు, నవభారత నిర్మాత అన్నారు. నెహ్రూ దార్శనికత వల్ల దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. స్వర్గీయ కందుకూరి వీరేశలింగం పంతులు 105వ వర్ధంతిని సోమవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కందుకూరి గొప్ప సంఘసంస్కర్త, స్త్రీ జనోద్ధారకుడు, తెలుగుభాషోద్ధారకుడిగా తులసిరెడ్డి ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాసవిమాత అమ్మవారికి వైభవంగా ఒడిబియ్యం వల్లింపు కార్యక్రమం



బద్వేలు అర్బన్ , మే 27 ప్రభాతవార్త :పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సోమవారంపలు రకాల విశేష పూజలను నిర్వహించారు. అమ్మవారికి ఒడింబియ్యం వల్లింపు కార్యక్రమం ఆర్యవైశ్య మహిళా మండలి అద్యక్షురాలు దేవతి లలిత, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, మాజీ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మిల ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఒడిబియ్యం వల్లించడం కార్యక్రమాన్ని వైభవంగానిర్వహించారు. ఆర్యవైశ్యవర్తకసంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరీ నాగరాజ మరియు కమిటిసభ్యుల ఆద్వర్యంలో వాసవిమాత అమ్మవారికి తెల్లవారుజామున వివిధ రకాల ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు.అలాగే సాయంకాలం అమ్మవారికి ఒడిబియ్యం వల్లింపు కార్యక్రమాన్ని మహిళా మండలివారి ఆధ్వర్యంలో చేపట్టారు.ముఖ్యంగా అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన వారిలో రిటైర్డ్ బ్యాంక్ ఎంప్లాయ్ కొండపల్లి సుబ్బారావుసతీమణి లక్ష్మి కాంతమ్మ, కుమారుడు కొండపల్లి వెంకట సుభాష్‌కుమార్ సతీమణి సుగుణ, మేడా వెంకటసుబ్బయ్యసతీమణి సురేఖ , కుప్పం సుధాకర్ సతీమణి దాక్షాయణిదేవి, మాలేపాటి సుధాకర్ సతీమణి సుప్రియ, గుబ్బా వెంకట క్రిష్ణసతీమణి నాగ గౌరి, తులసి వెంకటశివనారాయణ సతీమణి ఇందుమతి, మేడా అంజన్‌కుమార్ సతీమణి స్వాతి,కుటుంబ సభ్యులకు సభ్యుల చేతుల మీదుగా వాసవిమాత అమ్మవారికి ఘనంగా ఒడిబియ్యం ఒల్లింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరంపలువురు ఉభయదాతలు భక్తి,శ్రద్దలతో వాసవిమాత అమ్మవారిని దర్శించుకుని జైవాసవాంబ, జై వాసవాంబ అంటూతమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వనితాక్లబ్ ట్రెజరర్ గొంట్ల కుమారి, తులసి వసుంధర, మల్లేశ్వరి, చలపాటి క్రిష్ణవేణి, జూటూరు పద్మ, హర్షితతో పాటు పలువురు మహిళలు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మ రమాబాయి 89వ వర్ధంతి



పీలేరు, మే 27 ప్రభాతవార్తః

మండలంలోని మాలమహానాడు కార్యాలయంలో మండల అధ్యక్షులు రవీంద్ర ఆధ్వర్యంలో ఆదర్శ మూర్తి రమాబాయి అంబేద్కర్ 89వ వర్ధంతినిమండల ఉపాధ్యక్షులు బద్దె భాను ప్రకాష్ అధ్యక్షతన అమ్మ రమాబాయి చిత్రపటానికి మాలమహానాడు సీనియర్ నాయకులు గట్టప్ప, మల్లికార్జునలు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ మనకు చదువు, గూడ, నీడ, స్వేచ్చగా బతికే జీవితం ఇచ్చారని అందరిం చెప్పుకుంటాం ఇవన్నీ మనకు ఇచ్చిన ఆయన తన కుటుంబానికి ఏమి ఇచ్చాడని ప్రశ్నించుకుంటే ఆయన భార్య రమాబాయి పోరాటం కనిపిస్తుంది. అణగారిన వర్గాల కోసం అంబేద్కర్ చేసిన ప్రతి పోరాటంలో చరిత్ర గుర్తించలేని రమాబాయి త్యాగాన్ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. రమాబాయి ఆమె చేసిన త్యాగం ఎన్నటికి మరువలేనిది చరిత్ర గుర్తించని మరుగున పడిన చరిత తల్లి రమాబాయిది. ఆమె త్యాగం విశ్వం ఉన్నంతవరకు చెరపలేని చరిత్ర ఈదేశం బంగారు భవిత కోసం సగానికి పైగా ఉన్న మహిళలు తమ దిశను తల్లి రమాబాయి వైపు నుంచి చూసుకుంటే ఆకుటుంబం సమాజానికి చిరుధాన్యాలుగా వెలుగుతుంది వారి ఆశయాలను సాధించడానికి వారు చూపిన మానసిక ధైర్యం అలవర్చుకొని అనగారిణ వర్గాల కోసం ముందు నడవడమే మనం వారికి ఇచ్చే ఘన నివాళులు అని తెలిపారు. ఈకార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్‌కుమార్, సుభాష్, పాలకుంట శ్రీనివాసులు, కష్ణయ్య, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాల పట్ల పలువురు మానవత్వాన్ని చాటుకోవాలి

:ఆర్యవైశ్య మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లిదేవి



బద్వేలు అర్బన్ , మే 27 ప్రభాతవార్త :

అటవి ప్రాంతంలో మూగజీవాల దాహర్తి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ సహృదయంతో తమ మానవత్వాన్ని చాటుకోవాలని ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షులు దేవతిలలిత, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లిదేవి, మాజీ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, సెక్రటరీ గంగిశెట్టి ధనమ్మతో పాటు పలువురు మహిళలుఅన్నారు. సోమవారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి వడిబియ్యం వల్లింపు కార్యక్రమం అనంతరంఆర్యవైశ్య మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లిదేవి, అధ్యక్షురాలు దేవతి లలితలు మాట్లాడుతూ బద్వేలుప్రాంతంలో సిద్దవటం అడవి, మైదుకూరు రోడ్డు రేకలకుంట అటవి ప్రాంతంలో మరియు నెల్లూరు రోడ్డులోని పీపీకుంట అటవి ప్రాంతంలో వేసవికాలం నుంచి ప్రతిరోజూ మూగజీవాలు నీటికోసం అడవిలోనుంచి బయటకు వస్తున్నాయనిప్రతి ఒక్కరూ వాహనాలలో వెళ్లేటపుడు మీకు తోచిన కాడికి పండ్లుగాని, నీటిని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు.మూగ జీవాల పట్ల ప్రతి ఒక్కరూ కూడా రహదారిలో వెళ్లేటపుడు వాటి దాహర్తి తీర్చడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగావ్యవహరించాలన్నారు. రోడ్డుపైన అనేక రకాల మూగజీవాలు తిరుగుతూ ఉంటాయని వాహనదారులు కూడా మూగ జీవాలనుగమనిస్తూ వాహనాలను నడపాలన్నారు. చాలా ఏరియాలలో గుర్తుతెలియని వాహనాలు ఢీ కొనడం వలన కొన్నిచోట్లమూగ జీవాలు మృత్యువాత పడ్డాయన్నారు. కావున వాహనదారులు అటవి ప్రాంతంలో ఏర్పాటుచేసిన నీటి తొట్లలోనీటిని నింపి వాటి దాహర్తిని తీర్చాలని కోరారు. ఇటీవల కాలంలో మహిళా మండలి ఆధ్వర్యంలో పీపీ కుంట

అటవి ప్రాంతంలో దాతల సహకారంతో అనేకనీటి తొట్లను ఏర్పాటు చేసి మూగ జీవాల దాహర్తి తీర్చడం జరిగిందనిరాబోయే రోజులలో ఇలాంటి సేవా కార్యమాలు మరెన్నో చేపట్టేందుకు కృషిచేస్తామన్నారు. ఇప్పటివరకు ఇందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## కారు-బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి





చిట్వేలి, మే 27, ప్రభాతవార్త:

కారు, బైకు ఢీకొన్న సంఘటనలో బైకులో ఉన్న ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన సోమవారం చిట్వేలి గ్రామం అంబేద్కర్ సర్కిల్ వద్ద చోటు చేసుకుంది. రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేటకు చెందిన గడ్డం వంశీ(26), పెనగలూరు మండలం కట్టవారిపల్లికి చెందిన మల్లికా కార్తీక్(16)లు బైక్‌లో వెళ్తుండగా రైల్వేకోడూరుకు చెందిన వల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కారు నెంబరు ఏపీ04ఏజీ1899 నంబరు గల వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఇరువురు మృతి చెందారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఘనంగా సాయి లోకేష్ జన్మదినం.



రైల్వే కోడూరు మే 27 ప్రభాతవార్త...

అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షులు సాయి లోకేష్ జన్మదిన వేడుకలను రైల్వేకోడూరు బిజెపి నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయి లోకేష్ జన్మదిన పురస్కరించుకొని కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు.ఆయన మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. సాయి లోకేష్ మరెన్నో ఉన్నత పదవులను పొందాలని వారు ప్రజాసేవలో ఎల్లప్పుడూ ఉండి ప్రజాసేవ చేస్తూ ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాకచర్ల సుబ్బారావు, సాయం శ్రీధర్, సాయి ఆచారి, విజయ్ కుమార్, జోగినేని సుబ్బారావు, వెంకటసుబ్బయ్య, గౌరీ శంకర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డుప్రమాదం-లారీ ఢీ కొని మహిళ మృతి

### లారీ టైర్ల కింద పడి మహిళ తలభాగం, శరీర భాగం నుజ్జునుజ్జు





యర్రగుంట్ల, మే 27, ప్రభాతవార్త:

యర్రగుంట్లలోని నాలుగు రోడ్ల కూడలి కడప రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తల్లి షేక్ దిల్షాద్(48) లారీటైర్ల కింద పడి మహిళ తలభాగం, శరీర భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాధ ఘటనను సీఐ ఈశ్వరయ్య పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు యర్రగుంట్ల పట్టణంలోనిరాణీవనంకు చెందిన దిల్షాద్‌కు నలుగురు సంతానం. ముగ్గురు కుమార్తెలు, కుమారుడు కలరు. దిల్షాద్ కుమారుడితో కలిసి సోమవారం మధ్యాహ్నం కడపలో ఉండే బంధువులుమృతి చెందిన విశయం తెలుసుకొని వారిని చూడటానికి బయలుదేరారు. వారు వస్తూఉండగా నాలుగు రోడ్లు కూడలి దాటి కడప రోడ్డులోని కొంత దూరం వెళ్లగానే లారీవచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ టైర్ల కింద దిల్షాద్ పడి తల భాగం విడిపోయి శరీరం అంతా నుజ్జునుజ్జు అయి అక్కడే మృతి చెందింది. కుమారుడు హనీఫ్‌కు చిన్నగాయాలతో బయటపడ్డాడు. కళ్ల ఎదుటే తల్లిని కోల్పోయిన కుమారుడు హారీఫ్ విగతజీవిగా మారాడు. విశయాన్ని తెలుసుకున్న భర్త ఫకృద్దీన్ సంఘటన వచ్చి ఘటననుచూసి కన్నీరు, మున్నీరుగా విలపించాడు. యర్రగుంట్లలోని నాలుగు రోడ్ల కూడలిలో తరచూ రోడ్డు ప్రమాదాలే జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలను అరికట్టాల్సిన అధికారులు ట్రాఫీక్‌నుఅదుపుచేయలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాలుగు రోడ్ల కూడలి కడపకు పోవు దారిలో సిటీ ప్యాలెస్ పక్కన ప్యాసింజర్ తుఫాన్, ప్యాసింజర్ ఆటో రోడ్డుపక్కన ట్రాఫీక్ నిబంధనలకు విరుద్ధంగా ఉంచడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ముందే ఇరుకురోడ్లు పైగా రోడ్డుపైన నీళ్లు, బురద ఎక్కడ పడితేఅక్కడ భారీ వాహణాలు నిలపడంతోనే తరచూ ఇక్కడే ప్రమాదాలు ఎక్కువగా జరిగి ప్రజలు ప్రాణాలు కోలోతున్నారు. రెండు రోజుల క్రితం చిలంకూరు ఘటనలో సంపంగికుల్లాయప్ప, ఇప్పుడు దిల్షాద్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలిపారు. టౌన్ మధ్యలో ప్రజలు రోడ్లమీదకి రావాలంటేనే భయమేస్తోందని తెలిపారు. ఇప్పటికైనఅధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొని ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. సోమవారం జరిగిన ప్రమాద ఘటన స్థలానికి సీఐఈశ్వరయ్య పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## గోరుముద్దపై శిక్షణ కార్యక్రమం



చాపాడు, మే 27, ప్రభాతవార్త: స్థానిక ఎంఆర్‌సీ భవణం నందు సోమవారం మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులఆదేశాల మేరకు గోరుముద్దపై ఎంఈఓ రవిశంకర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా వంట ఏజన్సీ పాఠశాలలో అమలు చేయుచున్న మెనూ,పిల్లలకు రుచికరంగా పరిశుభ్రమైన వంటకం వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలోజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాపాడు వంట ఏజెన్సి నిర్వాహకులు కొండారెడ్డి ప్రథమ బహుమతి, అశ్విని కేతవరం రెండవ బహుమతి, ఎం.సాలమ్మ అనంతపురంమూడవ బహుమతి గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 వంశీకృష్ణ, సిబ్బంది లక్ష్మిదేవి, కృష్ణయ్య, మహేష్ పాల్గొన్నారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు-ఎస్ఐ



చాపాడు, మే 27, ప్రభాతవార్త:

ఎన్నికల సంధర్భంగా జూన్ 4వ తేదిన జరుగు ఎన్నికల కౌంటింగ్ రోజున 144సెక్షన్ అమల్లో ఉన్నందున గ్రామాలలో ప్రజలు గుంపులుగుంపులుగా ఉండకూడదని ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని అల్లాడుపల్లెతో పాటు పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సంధర్భంగా ఎటువంటిఊరేగింపులు, ర్యాలీలు, బాణాసంచా కాల్చడం వంటివి చేయకూడదన్నారు. చట్టాన్ని వ్యతిరేకిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రాచీన కళకు జీవం పోస్తున్న పోస్ట్‌మాన్

**- కోలాటంతో ఆకట్టుకుంటున్న మల్లేష్‌నాయక్**

**- చిన్నపిల్లలతో నృత్యప్రదర్శన భళారే అంటున్న కోలాట ప్రియులు**

**- బృందానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న హోమ్‌గార్డ్ సుధాకర్**





గాలివీడు, మే 27(ప్రభాతవార్త):

ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పాశ్చాత్య పోకడలు కొత్త పుంతలు తొక్కుతున్న వేళ మన పూర్వీకులు అందించిన ప్రాచీణ కళలు అంతరించిపోతున్న తరుణంలో ఎక్కడో ఓ చోట మారుమూల ప్రాంతాల్లో కొందరు కళాకారుల చొరవతో మళ్లీ అవి ప్రాణం పోసుకుని కళాకారుల ఊపిరిగా ప్రజాదరణ పొందుతున్నాయి. అందులో భాగంగానే అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని వెలిగల్లు తాండాకు చెందిన 25 సంవత్సరాల కుర్రాడు మల్లేష్‌నాయక్ పోస్ట్‌మాన్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఖాళీ సమయంలో చిన్నపిల్లలకు తర్ఫీదునిస్తూ కోలాటంతో పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చి భళారే అనిపించుకుంటున్నాడు. శ్రీనివాసులునాయక్, తవరమ్మ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఇద్దరు సంతానం కాగా తండ్రి శ్రీనివాసులునాయక్ రాయచోటి పట్టణంలో జామ పండ్ల వ్యాపారంతో కొడుకు మల్లేష్‌నాయక్‌ను డిగ్రీ వరకూ చదివించాడు. అయితే డ్యాన్స్‌పై మక్కువతో మల్లేష్‌నాయక్ హైదరాబాద్ పట్టణంలో సినీ అవకాశాల కోసం దాదాపు 7 సంవత్సరాలు కాళ్లరిగేలా తిరిగాడు. ఫలితం లేకపోవడంతో పోస్ట్‌మాన్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ రావడంతో కుటుంబసభ్యుల ఒత్తిడితో దరఖాస్తు చేసుకున్నాడు. సొంత గ్రామంలో పోస్ట్‌మాన్‌గా ఉద్యోగం రావడంతో సంతోషపడ్డాడు. అయితే తనకు డ్యాన్స్ మీద ఉన్న మక్కువ మాత్రం చావలేదు. ఎలాగైనా డ్యాన్స్ ప్రదర్శనలు ఇచ్చి మంచి డ్యాన్సర్‌గా పేరు తెచ్చుకోవాలన్న సంకల్పంతో పలుచోట్ల ప్రదర్శనలు ఇచ్చేవాడు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో అంతగా సినిమా డ్యాన్స్‌లకు అనుకున్న స్థాయిలో ఆదరణ దొరకలేదన్నఅసంతృప్తితనను నిరుత్సాహప రిచింది. ఇదే తరుణంలో ప్యారంపల్లి గ్రామం వడ్డిపల్లికు చెందిన ఓ పోలీసు ఉద్యోగా సుధాకర్, అంజనమ్మ దంపతులు తనకు పరిచయం ఏర్పడటంతో వారిరువురు తనను ప్రోత్సహించారు. ప్రస్తుత సమాజంలో గ్రామీణ కళలకు మంచి ఆదరణ ఉందని గుర్తుకు చేస్తూ తనను కోలాటం నేర్చుకునేలా ఉత్తేజపరిచారు. తమ గ్రామంలోని 30 మంది పిల్లలకు కోలాటం నేర్పించేందుకు గాను కొంత ఆర్థిక సహాయం చసి వారికి కావాల్సిన కోలాటం సామాగ్రిని వితరణ చేశారు. ఇదే ప్రోత్సాహంతో కోలాటంలో తానూ నైపుణ్యం పొంది ఆ 30 మంది విద్యార్థులకు తర్ఫీదునిచ్చాడు. గత 3 సంవత్సరాలుగా మండలంలోనే కాక జిల్లా వ్యాప్తంగా గ్రామదేవతల ఉత్సవాలు, వివాహ మహోత్సవాలు, దేవాలయాల వార్షికోత్సవాల వద్ద పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అంటూ అందరి దృష్టిని ఆకర్షించాడు. దీంతో అవకాశాలు పెరగడంతో ఒక్క కోలాటంతోనే కాకుండా వివిధ దేవతామూర్తుల వేషధారణలతో కాళీమాత, శ్రీకృష్ణుడు, శివుడు, శ్రీరామచంద్రుడు, ఆంజనేయస్వామి వేషధారణ ప్రదర్శనలు కూడా ఇవ్వడం ప్రారంభించాడు. ఈ చిన్నపాటి ప్రదర్శనలతో వచ్చిన నగదును అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసి మిగిలిన డబ్బులు బృందంలోని చిన్నారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇదే ప్రోద్బలంతో మండలంలోని గొట్టివీడు, పక్కీరారెడ్డిగారిపల్లె, గరుగుపల్లె గ్రామంలోని పూజలవాండ్లపల్లె నుండి పలు ఔత్సాహిక మహిళలు, చిన్నారులను బృందాలను తయారు చేస్తున్నట్లుగా తెలిపారు. ప్రభుత్వం వైపు నుండి తమలాంటి కళాకారులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తే మరింతా రాణించడానికి అవకాశం ఉంటుందంటున్నారు.

## కుటుంబసమస్యలతో యువకుడు ఆత్మహత్య

మదనపల్లెక్రైం, మే 27 ప్రభాతవార్త :

కుటుంబసమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. పట్టణంలోని నక్కలదిన్నెతాండాకు చెందిన ఇబ్రహీం కుమారుడు సద్దాం (28) కుటుంబసమస్యలతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు సద్దాంను వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వల్లిసాబ్ తెలిపారు. మృతదేహంను శవపరీక్షల నిమిత్తం మార్చురీకి తరలించారు.

## ఆటో ఢీకొన్న ఆర్టీసి వ్యక్తి దుర్మరణం

మైదుకూరు మే27, ప్రభాతవార్త : మైదుకూరు మండల పరిధిలోని కేసిలింగాయపల్లె సమీపానా మైదుకూరు నుండి వనిపెంట వైపు వెళ్తున్న ఆటోను మైదుకూరు నుండి విజయవాడ వెళ్తున్న ఆర్టీసి సుపర్ లగ్జరీ బస్సు వెనక ఉండి ఢీకొనడంతో ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి దుర్మరణం చెందారు.ఉత్సలవరం గ్రామానికి చెందిన సుంకర కొండయ్య (55)అను వ్యక్తి పని నిమిత్తం మైదుకూరు టౌనుకు వచ్చి పని ముగించుకొని తిరిగి ఆటోలో తన స్వగ్రామానికి వెళ్తుండగా వనిపెంట రోడ్డులోని ఇండియన్ పెట్రోల్ బంకు సమీపానికి రాగనే విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ సుపర్ లగ్జరీ బస్సు వెనక నుండి ఢీకొనడంతో ఆటో బోల్తాపడి ఆటోలో ప్రయాణిస్తున్న సుంకర కొండయ్యకు బలమైన దెబ్బలు తగలగా ఆయనను 108 అంబులెన్సులో మైదుకూరు గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టరు పరిశీలించి తలకు బలమైన గాయం తగలడంతో అక్కడే మృతిచందినట్లు తెలిపారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చెపట్టారు.

## యాచకురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్



ప్రొద్దుటూరు అర్బన్, మే 27, ప్రభాతవార్త:

స్థానిక ప్రొద్దుటూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు గుర్తు తెలియని యాచకురాలు(35) మరణించగా అంత్యక్రియలు చేయడానికిబంధువులు లేకపోవడంతో ఎర్రగుంట్ల పోలీస్ సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఫౌండర్ మోరె లక్ష్మన్ రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించిసోమవారం హిందూ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించినఫౌండేషన్ చైర్మెన్ మోరె లక్ష్మన్ రావు, ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్, పోలీసు సిబ్బంది ఫిరోజ్ యాదవ్, కృపా అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు పాపిశెట్టి వెంకటలక్షుమ్మ,సుమన్‌బాబు, సురేష్ మరియు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సహాయం చేయదలచిన దాతలు ఉంటే 82972 53484,91822 44150 అనే నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

# సుందర నగరంగా కడపను తీర్చిదిద్దుతాం..

## - కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్



కడప కార్పొరేషన్, మే 27, ప్రభాతవార్త: తడి చెత్త సేకరణ రోజు ఆరు టన్నులకు తగ్గకుండా సేకరించాలి. ఎంఆర్ఎఫ్ ప్లాంట్‌లో వెట్ వెస్ట్ రీసైకిల్ చేయు విధంగా చర్యలు చేపట్టాలని, కంపొస్టర్ బిన్స్ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని, పుట్లంపల్లిలో ఎంసీసీ ముందు భాగంలో వేసిన కంపోస్టు క్లీన్ చేయాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ అధికారులను ఆదేశించారు. కడప నగరంలోని పుట్లంపల్లి ఎంసీసీ, ఎంఆర్ఎఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉక్కాయపల్లి గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్, ఆకులవీధి, వినాయకనగర్ జీటీఎస్‌లను శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాధికారులతో కలిసి కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ పరిశీలించారు. ప్రతి జోన్ నుంచి వచ్చిన తడి, పొడి చెత్త వివరాలను పరిశీలించారు. ఎంసీసీలో ఎలక్ట్రికల్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. ఎంఆర్ఎఫ్‌లో పవర్ కనెక్షన్ ఏర్పాటు చేయుటకు తగు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. అలాగే అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ రత్నాల రాజు, ఏఈ మణిగోపాల్‌రెడ్డి, ఎంహెచ్ఓ, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

### - ఎంపీడీవో కృష్ణమూర్తి



తంబళ్లపల్లె, మే 27, ప్రభాతవార్త: తంబళ్లపల్లె మండలంలోని సమస్యలపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని ఎంపీడీవో కృష్ణమూర్తి ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన అత్యవసర మండల సర్వసభ్య సమావేశంలో మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సరిపడా వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయాలన్నారు. అదే విధంగా వర్షాకాలం దృష్ట్యా మారుమూల గ్రామాల్లో తాగునీటి కాలుష్యం, పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తేవాలన్నారు. కోసువారిపల్లె డా.మునికుమార్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తేవాలన్నారు. కోసువారిపల్లె డా.ముని కుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ముందస్తుగా తాగునీటి ట్యాంకులు శుభ్రంతో పాటు పారిశుద్ధ్యంపై అవగాహన, ముందస్తుగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సహకారంతో ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఏపీఎం గంగాధర్ మాట్లాడుతూ అర్హులైన అబ్దిదారులకు ఆసరాతో పాటు చేయూత నిధులు బ్యాంకు ఖాతాలో జమ చేశామని లబ్ధిదారులు పొందాలని సూచించారు. మండల సర్వసభ్య సమావేశంలో ఏవో రమణకుమార్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కోటిరెడ్డి, కోఆప్షన్ మెంబర్ జమాల్ బాషా, ఆర్‌బీకే ఛైర్మన్ రెడ్డి మల్‌రెడ్డి, ఎంపీటీసీ సరోజమ్మ, మండల వైకాపా అధ్యక్షుడు రేపన చౌడేశ్వర, ఏపీవో అంజనప్ప, ఎంఈవో త్యాగరాజు, ఏఈలు హరినాథ్, సుజాత, సెక్షన్ ఆఫీసర్ రెడ్డి ప్రసాద్, బీవో రామరాజు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దళితులపై దాడులు అన్యాయం..

కడప వైద్యవిభాగం, మే 27, ప్రభాతవార్త:

చింతకొమ్మదిన్నె మండలంలోని కొంత మంది దళిత నాయకులు వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు దళితులపై దాడులు జరిగాయని ఆరోపిస్తున్నారు. ఈ గొడవలు సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన గొడవలు కేవలం రాజకీయంగా జరిగినవి. అయితే గత వైసీపీ ప్రభుత్వం దళితులపై దౌర్జన్యాలు మారణహోమాలు, సిరో ముండలం, దళితుల మాన ప్రాణాలు తీసినప్పుడు మాట్లాడని దళిత నాయకులు ఇప్పుడు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దళితులకు ఏసిన అన్యాయం గురించి మాట్లాడకుండా వైసీపీ నాయకులు దౌర్జన్యాలు దాడులు చేసినప్పుడు ఎకనకడ దాక్కుఉన్నారు. ఈ దళిత నాయకులు. వైసీపీ పార్టీకి ఊడిగం పనులు చేస్తూ మండలంలో భూ కబ్జాలు చేసుకుంటూ పాలేరు బతుకులు బతికిన వీరా దళితుల గురించి మాట్లాడేది సిగ్గులేదా. నారా లోకేష్, చంద్రబాబుపై నిందలు వేసి మాట్లాడడం తగదని తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారని దళిత మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి కొట్టం సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు కొడమలపల్లె వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## హద్దు మీరితే కేసులు నమోదు చేస్తాం:- ఎస్సై సుధాకర్



చిట్వేలి, మే 27, ప్రభాతవార్త: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎవరైనా హద్దు మీరి ప్రవర్తిస్తే అట్టివారిపై చట్టరిత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు అధికారి సూచన మేరకు సోమవారం ఉదయం కేంద్ర బలగాలతో కలిసి ఎన్నికల్లో సమస్యాత్మకంగా నిలిచిన సి.కందులవారిపల్లి, మిట్టపల్లి, తుమ్మచెట్లపల్లి, రంపావారిపల్లి గ్రామాల్లో నాకా బంధీ నిర్వహించారు. అల్లర్లకు దిగితే శిక్ష తప్పదని ఆయా గ్రామస్థులకు హెచ్చరించారు. చిట్వేలి గ్రామ ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఫలితాలు వెలువడిన తరువాత టపాసులు పేల్చడం, కేకలు వేయడం, బైకుల ర్యాలీలు, గొడవలను ప్రేరేపించడం నిషేధమన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అతిక్రమిస్తే శిక్షార్హులని హెచ్చరించారు. ఏఎస్సై వెంగయ్య, బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌పీసీఎల్‌లో ఉత్తమ డీలర్ అవార్డును అందుకున్న

## అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ అధ్యక్షులు బేపారి మహ్మద్‌ఖాన్




రాయచోటి గ్రామీణ, మే 27, ప్రభాతవార్త: అనంతపురం జిల్లా కేంద్రంలో హెచ్‌పీసీఎల్ 2024-25 రీజనల్ సమావేశంలో అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ అధ్యక్షులు బేపారి మహ్మద్‌ఖాన్, హెచ్‌పీసీఎల్ రీజనల్ మేనేజర్ మన్మథరావు, ఎసేల్స్ ఆఫీసర్ రమవత్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందజేశారని బేపారి మహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్‌లో తమ సేవలను గుర్తించి ఉత్తమ అవార్డును అందజేయడం చాలా సంతోషకరమన్నారు. నాకు సహకరించిన సిబ్బందికి నాతో పాటు డీలర్ అసోసియేషన్ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## వెల్లాలలో వైభవంగా స్వామివారి వసంతోత్సవం

### భక్తి శ్రద్ధలతో కుందూనదిలో శ్రీచెన్నకేశవస్వామివారి చక్రస్నానం

రాజుపాళెం,మే27,ప్రభాతవార్త.

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీదేవి,భూదేవి సమేతంగా శ్రీచెన్నకేశవస్వామి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు.అనంతరం కూందూనదిలో శ్రీచక్రసాన్నం భక్తిశ్రద్ధలతో ఘనంగా వేదపండితులు నిర్వహించారు.బ్రహ్మోత్సవాలలో చివరి ఘట్టం అయిన వసంతోత్సవం,శ్రీచక్రస్నానం,ధ్వజఅవరోహనం కార్యక్రమాలు ఆలయ కమిటి చేర్మేన్ బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి,ఇఒ బి.వి.నరసయ్య మరియు కమిటి సభ్యుల ఆద్వర్యంలో కార్యక్రమాలను వేదపండితులు భక్తి శ్రద్ధలతోనిర్వహించారు.భక్తులు,కార్యనిర్వాహకులు బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా జరుపుకొని చివరిగా స్వామివారి హంసపల్లకీ ఉత్సవంలో వసంతాలు చల్లుకొనుచూ సంతోషంను పంచుకొంటూ,పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని మొలకలు చేతభూని ఆనందంగా జరుపుకున్నారు.కుందూనదిలో శ్రీచక్రస్నానంను శాస్త్రోక్తంగా పండితులు భక్తులతో కలిసి నిర్వహించారు.రాత్రి ధ్వజాఅవరోహన కార్యక్రమంను నిర్వహించారు.ఈకార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి,బాలనాగిరెడ్డి, వెంకటరామిరెడ్డి,వెంకటపతిరెడ్డి,జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## 29న శ్రీ అంకాళమ్మ అమ్మవారికి సిల్లు బోనాలు



కలికిరి, మే 27, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని కలికిరి పంచాయతీలో కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో గ్రామ దేవతగా వెలసిన శ్రీ అంకాళమ్మ అమ్మవారి జాతర ఈనెల 29న జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈనెల 28 మంగళవారం మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమంతో ప్రారంభమై 29న అమ్మవారికి సిల్లు బోనాలతో మొక్కులు చెల్లించి జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా ముందుగానే శ్రీఅంకాళమ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో అలంకరించారు. దీంతో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తూ అమ్మవారికి పూజలు చేస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందిస్తున్నారు.

# దోచుకుని దాచుకోవడంలో జగన్ దిట్ట

## సహకరించిన అధికారులకు అధోగతే

## బిజెపి నేత పోతుగుంట రమేష్ నాయుడు



రాజంపేట అర్బన్,మే 27 ప్రభాతవార్త

ఆదాయం వచ్చే మార్గాలను జల్లెడ పట్టి మరి దోచుకున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి గ్యాంగు కొత్త ట్రెండ్ సృష్టించారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతుకుంట రమేష్ నాయుడు ధ్వజమెత్తారు.అధికారులను తొత్తులుగా మార్చుకొని ఇష్టారాజ్యంగా అవినీతి చేశారని ఆరోపించారు. సోమవారం రాజంపేటలోని బిజెపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి కొత్త ట్రెండు సృష్టించాడని నిస్సిగ్గుగా చెప్పుకోవడం అవినీతికి పరాకాష్ట అని పేర్కొన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా దళితులకు ఇచ్చే పథకాలను మూసేసి కొత్త ట్రెండ్ సృష్టించ లేదని ఎద్దేవా చేశారు. దళితుడైన డాక్టర్ సుధాకర్ను పిచ్చివాడిని చేసి హింసించి చంపిన చరిత్ర అనేది వైసీపీదే అన్నారు. బాబాయి హత్యకు గురైతే దాన్ని రాజకీయంగా వాడుకున్న చరిత్ర అందరికీ తెలుసు అన్నారు. నేడు చీఫ్ సెక్రటరీగా ఉన్నటువంటి జవహర్ రెడ్డి విశాఖపట్నం రాజధానిగా ఉంటుందని చెప్పి ఆ చుట్టుపక్కల ఉన్న దళిత భూములు అన్నిటిని తన అనుచరుల పేరు మీద రాసుకొని దళితుల నోట్లో మట్టి కొట్టి కొత్త ట్రెండ్ సృష్టించారని విమర్శించారు. రాజధాని విశాఖపట్నం కు వస్తుందని ప్రజలను నమ్మించి ఆ భూములు అమ్ముకోవాలని ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రవర్తిస్తున్న చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి ఎన్నికల్లో జరిగినటువంటి అవకతవకలన్నిటికీ కారకుడు అని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ గాని ఎన్నికల వ్యవస్థ గాని పూర్తిగా వైసిపి కంట్రోల్లో పనిచేస్తున్నట్టుంది గాని ఎవరికి న్యాయం చేసే విధంగా మీరు వ్యవహరించ లేదని అన్నారు. జవహర్ రెడ్డిని తొలగించి ఆ స్థానంలో నిజాయితీగల అధికారిని నియమించాలని బిజెపి డిమాండ్ చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగల ఆదినారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి జీకే నాగరాజు ,పట్టణ కార్యదర్శి పెనుగొండ రమణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి సూర్యచంద్ర ,ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు బొజ్జ అభిరామ్ ,పట్టణ ఉపాధ్యక్షులు రవి పాల్గొన్నారు.

## కృష్ణంపల్లెలో పోలీసుల తనిఖీలు



దువ్వూరు, మే 27, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో సోమవారం మైదుకూరు సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సీఐ శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐశ్రీనివాసులు తనిఖీలు నిర్వహించారు. వచ్చే నెల 4వ తేదిన ఎన్నికల ఫలితాలు వస్తున్నందున ముందుజాగ్రత్త చర్యగా గ్రామంలో నాకాబంది నిర్వహించి ఇళ్లలోనూ, వాములలోనూతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికలలో గెలుపు ఓటములు సహజం అని ఎవరూ గెలిచినఓడినా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎవరి పనులు వారు చేసుకుంటూ జీవనం కొనసాగించాలని తెలిపారు. వచ్చే నెల 6వ తేది వరకు 144సెక్షన్ అమల్లో ఉంటుందనిచట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు పోలీస్ సిబ్బంది, ఏఆర్ఐ పోలీసులు తదితరులుపాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన సుంకులమ్మ తల్లి తిరునాళ్ల

కమలాపురం, మే 27, ప్రభాతవార్త: కమలాపురం చెరువుగట్టుపై వెలసిన వజ్రాల సుంకులమ్మ తల్లి తిరునాళ్ల సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వరాల సుంకులమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు వజ్రాల సుంకులమ్మ తల్లికి పలువురు భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని మొక్కుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందించారు.



## మదనపల్లె చేనేతకు బ్రాండ్ కల్పించాలి..

### వేలాది కుటుంబాల జీవనాధారం ఇక్కడేమరో సిరిసిల్లగా వెలగాలంటున్న నేతన్నలు

మదనపల్లె, మే 27 ప్రభాతవార్త :





పట్టుచీరలంటే మహిళలకు మక్కువే...రాష్ట్రంలో మదనపల్లె పట్టుచీరలంటే గుర్తుకు వస్తాయో గాని వాటి బ్రాండ్‌కు గుర్తింపు రాలేదు. ధర్మవరం, పొద్దుటూరు, వెంకటగిరి పట్టుచీరల కంటే మదనపల్లె చీరలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. కానీ పట్టుచీరలు పేరు వినగానే వెంకటగిరి, ధర్మవరం, కంచి వంటి పట్టణాల పేర్లు వినపడుతాయి. మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు చెందిన పట్టుచీరలకు బ్రాండ్ లేకపోవడంతో బయట ప్రాంతాల్లో ప్రాధాన్యత తక్కువ అవుతుంది. రాష్ట్రంలోనే అత్యధిక మంది చేనేత వ్యాపారులు, కార్మికులు, చేనేత మగ్గాలు మదనపల్లెలోనే ఉన్నాయి. 60వేల మగ్గాలు, 85వేల మంది కార్మికులు, 7వేలమందికి పైగా వ్యాపారులు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఒక్కప్పుడు చేనేత మగ్గానికి ఎంతో ప్రాధాన్యత ఉండేది. వీటి ద్వారా తయారైన చీరలే బయట ప్రాంతాలకు ఎగుమతి చేసి అమ్మకాలు జరిపే వారు. ఎప్పుడైతే హ్యాండ్‌లూమ్, అధునాతనమైన యంత్రాలతో తయారు చేసిన పట్టుచీరలు మార్కెట్‌లోకి రావడంతో చేనేత మగ్గం రానురాను కుంటుపడింది. ఒక్కరోజుకు యంత్రాల ద్వారా పలు చీరలను తయారు చేసే సామర్థ్యం ఉంది. అదే చేనేత మగ్గంతో ఒక్కరోజుకు ఒక్క చీరకూడా తయారు చేయలేని పరిస్థితి ఉంది. అయినప్పటికి కార్మికులను ఎక్కువ మంది ఉంచి నీరుగట్టువారిపల్లెలో మగ్గాల ద్వారా రాత్రింబవళ్ళు చీరలను తయారు చేయడం జరుగుతుంది. మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో వేలాది మంది కార్మికులు జీవనాధారం చేసుకొని జీవిస్తున్నారు. నాణ్యమైన ఒక్క చీరను తయారు చేయాలంటే మగ్గం నేసే వ్యక్తికి రూ.10నుంచి 30వేల వరకు ఖర్చు అవుతుంది. తయారైన చీరను లాభాలకు అమ్మాలి కాని నష్టాలకు అమ్మే పరిస్థితి ఏర్పడుతోంది. కారణం ముడిసరుకు ధరలు పెరగడం, ఎప్పటికప్పుడు తయారైన చీరలు అమ్మకాలు జరగకపోవడం వల్ల నష్టాలకు అమ్ముకోవాల్సి వస్తుంది. నేతన్నచే తయారైన చీరలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తే వీరు లాభాలు పొందే అవకాశం ఉంటుంది.

**మా చీరలకు బ్రాండ్ కల్పించాలి :- సువర్ణ సిల్క్‌హౌస్ వ్యాపారి మధు**

నీరుగట్టువారిపల్లెలో తయారయ్యే చీరలకు ప్రత్యేకమైన బ్రాండ్, ధర ఉండాలి. బయట ప్రాంతాల్లో మా చీరలను మదనపల్లె చీరలుగా కొనుగోలు చేసేలా ప్రభుత్వం బ్రాండ్ తేవాల్సి ఉంది. అప్పుడే ఇక్కడ తయారయ్యే చీరలు బాగా అమ్మకాలు జరుగుతాయి. బయట ప్రాంతాల్లో తయారయ్యే చీరలు నాణ్యతగా ఉండవు. మా వద్ద నాణ్యతతో పాటు ఆకర్షణీయంగా ఉంటాయని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. మదనపల్లె పట్టుచీరలకు పవర్‌లూమ్ దెబ్బ వెంటాడుతోంది. పెద్ద పెద్ద పట్టణాల్లో పవర్‌లూమ్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు వందల సంఖ్యలో చీరలను తయారు చేస్తారు. అదే మగ్గంతో అయితే చాలా తక్కువగా తయారు చేసే అవకాశం ఉంది. కావున మాకు బ్రాండ్‌తో పాటు ధర కల్పించాలని వ్యాపారులు చెబుతున్నారు. ఏది ఏమైనా మదనపల్లె పట్టుచీరలకు బ్రాండ్ కల్పించి, మరో సిరిసిల్లాలా వెలగాలని ఆశిద్దాం..

# ఆడపిల్లలను చదివిద్దాం



దువ్వూరు, మే 27, ప్రభాతవార్త: సమాజంలో ఆడపిల్లలకు మంచి విలువ ఇచ్చి వారిని చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీరలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రమైనదువ్వూరులోని అంగన్‌వాడి కేంద్రంలో కిశోర బాలికలకు, తల్లులకు వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యంపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లపుట్టడం భారం కాదని వరం లాంటిదని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందంజ వేస్తూ కుటుంబానికి, అటు సమాజాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు.ఆడపిల్లలను బ్రతికిద్దాం-చదివిద్దాం అనే నినాదంతో ముందుకు వెల్లాలని పేర్కొన్నారు. జీఎంఎస్‌కే కార్యకర్త శ్వేత మాట్లాడుతూ మహిళలకు ఎవరైన అసభ్య పదజాలంతోదూషించడం కానీ, అనైతికంగా ప్రవర్తించడం కానీ జరిగితే 181, 1098 హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చు అన్నారు. నేటి ఆడపిల్ల రేపటి అమ్మఈరోజు ఆడపిల్ల వద్దనుకుంటే రేపు మన సమాజం అమ్మలేని అనాథ అవుతుందని అందువల్ల ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను సమాజంలో గౌరవించాలని వారికి చదివించాలనితెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు సెక్టార్‌లోని ఆశా, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీరవాండ్లపల్లెలో మంచినీటి సమస్య పరిష్కారం



కలికిరి, మే 27, ప్రభాతవార్త: మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ వీరవాండ్లపల్లె గ్రామంలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ పంచాయతీ కార్యదర్శి గాయత్రిలు మంచినీటి సమస్య పరిష్కరించడం జరిగింది. గ్రామంలోని రక్షిత మంచినీటి బోరు మోటారు పూర్తిగా మరమ్మతులకు గురై గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తింది. మంచినీటి సమస్యపై గ్రామస్థులు స్థానిక సర్పంచ్‌కి పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడం జరిగింది. వెంటనే స్పందించిన సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, కార్యదర్శి గాయత్రిలు స్పందించి కొత్త మోటారు ఏర్పాటు చేయించి గ్రామంలో మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించడం జరిగింది. అదే విధంగా పంచాయతీలోని పాత హరిజనవాడలోమంచినీటి సమస్య తలెత్తడంతో ఆగామంలో 300 కుటుంబాలకు పైగా జీవనం గడుపుతుండడంతో ఆ గ్రామంలో కూడా కొత్త మోటారు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలోని గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ గ్రామ ప్రజలు మంచినీటి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

## భవనాలను ఆర్కిటెక్చర్ యూనివర్శిటీకి ఇస్తే అడ్డుకుంటాం

కడప ఎడ్యుకేషన్, మే 27, ప్రభాతవార్త:

వైవీయూ సంబంధించిన భవనాలను ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయానికి ఇస్తే అడ్డుకుంటామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న హెచ్చరించారు. సోమవారం వైవీయూ ఉపకులపతి చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకట సుబ్బయ్యలకు వినతి పత్రం ఇచ్చారు. ఆర్కిటెక్చర్ రిజిస్ట్రార్‌గా ఉన్నా ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి ప్రస్తుత ప్రభుత్వం అండ ఉందని వైవీయూ విశ్వవిద్యాలయం అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి వైవవీయూ ప్రధాన పరిపాలనా భవనాన్ని ఇతర భవనాలను లాక్కివడానికి ప్రయత్నిస్తున్నాడని, అయితే వైవీయూ అధికారులు మాత్రం జీ హుజూర్ అంటూ భవనాలను అప్పగించేందుకు కమిటీని నిస్సిగ్గుగా ఏర్పాటు చేసిందన్నారు. ఆర్కిటెక్చర్ రిజిస్ట్రార్ సురేంద్రనాథ్‌రెడ్డి కూడా తమ ఆలోచనలను విరమించుకోవాలని లేనిపక్షంలో అందరిని కూడా వవైవీయూ ద్రోహులుగా ప్రకటించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు స్వరూప్ తేజ, పీడీఎస్‌యూ నగర నాయకులు మనోజ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, మే 27, ప్రభాతవార్త:

కడప నగరంలోని మరియాపురం ఎస్బీఐ కాలనీ దగ్గర ఉన్న స్ప్రౌట్ వాల్యూ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ బిల్టప్ సర్కిల్‌లో ఉన్న కళ్యాణ మండపంలోకి షిప్టింగ్ అనుమతులు లేకపోయినా కూడా అక్రమంగా మార్చి అడ్మిషన్లు చేయడం దారుణమని, వెంటనే పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర అధ్యక్షులు చైతన్యలు డిమాండ్ చేశారు. స్ప్రౌట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కడప జిల్లా విద్యాశాఖాధికారి అనురాధకు వినతిపత్రం సమర్పించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి నగరంలోని బిల్టప్ సర్కిల్‌లో ఉన్న కల్యాణ మండపంలోకి ప్రభుత్వ అనుమతులు లేకపోయినా కూడా షిప్టింగ్ చేసి అక్రమ దారుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని వారు వాపోయారు. బిల్టప్ సర్కిల్లో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయని, విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇవన్నీ పట్టించుకోకుండా యాజమాన్యం కేవలం ఫీజులు ధ్యేయంగా, ఇష్టం వచ్చినట్లు గా పాఠశాలను మారుస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

అంతేకాకుండా పాఠశాలకు వంద మీటర్ల దూరంలో మూడు వైన్‌షాపులు ఉన్నాయని విద్యార్థులకు చదువుకోవడానికి ప్రశాంతత కూడా ఉండదని వారు పేర్కొన్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖాధికారులు స్ప్రౌట్ వ్యాల్యూ పాఠశాల గుర్తింపును రద్దు చేసి, విద్యార్థులు యొక్క భవిష్యత్తును కాపాడి యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని లేనియెడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

